నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులో శనివారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ ప్రమాదం మధ్యాహ్నం సంభవిస్తే భారీప్రమాదం జరిగేదని రాత్రి సమయంలో ఎవరు లేకపోవడం వల్ల నష్టం జరగలేదని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్‌స్తంభం కూలిపోయి వైర్‌లు తెగిపోవడంతో కరెంట్ కనెక్షన్ లేక.. సాగుకు నీరందించేందుకు ఇబ్బందిగా మారిందని, విద్యుత్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.



చెట్టుకు ఇరగకాసిన మామిడి

నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండల పరిధిలోని సిర్పూర్ గ్రామ శివారు సరిహద్దులో అటు పొతంగల్ శివారు సరిహద్దులో సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న మామిడి చెట్టుకు కాయలు ఇరగకాసాయి. రహదారిపై వెళ్తున్న వారు ఈ చెట్టును చూసి ఆశ్చర్యపోతున్నారు. చెట్టునిండా కాయలే కనిపిస్తున్నాయి. ఇంత కాత ఇదివరకు ఎన్నడూ చూడలేదని చర్చలు వినిపిస్తున్నాయి. కాగా దిష్టికాకూడదని చెట్టుకు ఇరువైపులా చెప్పులు కట్టినట్టు దాని యజమాని పేర్కొంటుండటం గమనార్హం.



చెట్టుకు కాసిన మామిడికాయలు

తునికాకు సేకరణ ఈసారి లేనట్టే



టెండర్ వేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్‌లు

- 18 శాతం జీఎస్టీ విధిస్తుండటంతో గిట్టుబాటు కావట్లేదని వెనకడుగు
- కల్లాలు ఏర్పాటు చేయని ఫారెస్ట్‌శాఖ
- ఉపాధికి దూరమవుతున్న సుమారు 15 వేల మంది
- జీఎస్టీతో బీడీ పరిశ్రమ కుదేలు.. పేదలు ఉపాధికి దూరం

నవతెలంగాణ-లింగంపేట్

తునికాకు సేకరణపై ఈసారి సైతం నీలి నీడలు కమ్ముకున్నాయి. టెండర్ దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్ లు ముందుకు రాకపోవడంతో అటవీ శాఖ కల్లాలు ఏర్పాటు చేయలేకపోతోంది. దీంతో వేసవి కాలంలో తునికాకు సేకరణపై ఆధార పడిన కుటుంబాలు ఉపాధి లేక ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీడీ పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధించడంతో తునికాకు సేకరణపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జీఎస్టీ 18 శాతం విధించడంతో పాటు రోడ్ ట్యాక్స్ ఇతరాత్ర ఖర్చులు తడిసి మోపెడు అవుతుండటంతో తమకు గిట్టుబాటు కావడంలేదని కాంట్రాక్టర్‌లు ముందుకు రావట్లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 15 వేల కుటుంబాలకు ఉపాధి లేకుండా పోతోంది.

కామారెడ్డి జిల్లాలో ఎల్లారెడ్డి, కామారెడ్డి, బాన్సువాడ, మాచారెడ్డి, నాగిరెడ్డిపేట్ రేంజ్ పరిధిలో దట్టమైన ప్రాంతాలు 82 వేల 980 హెక్టార్‌లలో విస్తరించి ఉన్నాయి. జిల్లాలో వేసవి కాలంలో అటవీ ప్రాంతం చుట్టుపక్కల వాసులకు తునికాకు సేకరణ ఉపాధిగా ఉంటుంది. ఈ సారి సైతం తునికాకు సేకరణలకు అటవీ శాఖ అధికారులు టెండర్లు వేసినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో తునికి కల్లాలు ఏర్పాటు చేయలేకపోతున్నారు. దీంతో పేద కుటుంబాలకు ఉపాధి కరవై పట్టణ ప్రాంతాలకు దినసరి కూలీలుగా వెళుతున్నారు.

కల్లాలు లేక ఉపాధి కరువు

అటవీశాఖ అధికారులు ప్రతి సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లో మార్చి నెలాఖరులుగా తునికాకు కల్లాలులు ఏర్పాటు చేసేవారు. ఏప్రిల్, మే నెలలో తునికాకు గ్రామీణ ప్రాంత వాసులు నుండి కొనుగోలు చేసేవారు. ఈ సంవత్సరం తునికాకు సేకరణలకు ఇంకా కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో దీని మీదే ఆధారపడిన నిరుపేద కుటుంబాలు దినసరి కూలీలు ఉపాధి లేక ఇక్కట్లు పడే అవకాశం ఉంది. తునికి ఆకు సేకరణ కోసం ఉదయం 6 గంటలకు కుటుంబ సభ్యులు పిల్లజల్లా సైతం సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లేవారు. తునికాకుల సేకరించి తిరిగి ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చేవారు.

అనంతరం కొంతమంది దినసరి కూలీలకు వెళ్లేవారు మిగతా ఇంటి దగ్గర ఉండేవారు. సేకరించిన తునికి ఆకును 50 ఆకులు కలిపి ఒక కట్టగా కట్టి సమీపంలోని కల్లాల వద్దకు తీసుకెళ్లేవారు. దీంతో వేలాది కుటుంబాలకు తునికి ఆకు సేకరణతో ఉపాధి లభించేది.

రెండేండ్లుగా ఉపాధి దూరం

కాగా గత రెండు సంవత్సరాల క్రితం జిల్లాలో ఎల్లారెడ్డి రేంజ్ పరిధిలో వెల్లుట్ల తిమ్మారెడ్డి యూనిట్లో టెండర్లు వేసి తునికి సేకరించారు. నిరుపేద కుటుంబాలకు ఉపాధి లభించింది. రెండు సంవత్సరాలుగా కాంట్రాక్టర్లు ముందుకు రాక తునికాకు కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రస్తుతం అది కూడా లేక ఉపాధి కోల్పోతున్నారు. టెండర్లు వేయకపోవడంతో మారుమూల గ్రామీణ ప్రాంత వాసులు తునికాకు సేకరించి అప్పులు తీర్చుకుందాం అని ఆలోచన ఉండడంతో వారి ఆశలు అడియాశలు అయ్యాయి.

జిల్లాలో ముఖ్యంగా లింగంపేట్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, రామారెడ్డి, మాచారెడ్డి, గాంధారి, బాన్సువాడ, మమ్మద్‌నగర్, రాజంపేట, తాడ్వాయి, సదాశివనగర్ మండలాల పరిధిలో గ్రామీణ ప్రాంతవాసులు తునికాకు సేకరణలో భాగం అయ్యేవారు. మరి కొంతమంది సేకరించిన తునికాకను ఇండ్ల వద్ద ఆరబెట్టుకుంటున్నారు. ఎండిన కట్టలను కొన్ని రోజుల తర్వాత పట్టణ ప్రాంతాలకు తీసుకెళ్లి రెండు రూపాయలకు ఒక కట్ట చొప్పున విక్రయించుకుంటామని చెబుతున్నారు.

ఉపాధికి కోల్పోయిన 15 వేల కుటుంబాలు

తునికాకు సేకరణ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలు 15వేల పైగా కుటుంబాలు ఈ సంవత్సరం ఉపాధి కోల్పోయాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే మాసంలో ప్రతి కుటుంబం ఉదయం సాయంత్రం పిల్లా జెల్లలు కలిపి ఉదయం 6 గంటల నుండి సమీపంలోని అటవీ బాట పట్టేవారు. ఆకు సేకరించి 10 గంటలకు ఇంటికి వచ్చేవారు 50 ఆకుల కడితే దానికి ప్రభుత్వం ఈ సంవత్సరం 3.50 పైసలు చెల్లిస్తుంది. ఈ లెక్కను ఒక్కొక కుటుంబం రోజుకు మూడు నుంచి 500 పైగా ఆకు కట్టలు సేకరించి కట్టేవారు. దీంతో సీజన్‌లో రెండు నెలల కాలానికి రూ.25 వేల నుంచి 40 వేల వరకు డబ్బులు సమకూరేవి. ఉన్న ఊర్లోనే ఉపాధి లభించేది. ప్రస్తుత ప్రభుత్వం కల్లాలు ఏర్పాటు చేయకపోవడంతో ఒకవైపు వైపు ఎండలు తీవ్రం కావడంతో మరోవైపు పొలం పనులు లేకపోవడంతో ఇళ్ళకే పరిమితమయ్యారు.

జీఎస్టీ విధించడంతో గిట్టుబాటు కావట్లే

కాగా తునికాకు సేకరణకు ధరలు పెంచడంతో తమకు గిట్టుబాటు కావట్లేదని కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదని సమాచారం. దీంతో పాటు జీఎస్టీ విధించడంతో తీవ్ర భారంగా మారినట్టు కాంట్రాక్టర్‌లు చెబుతున్నారు. జీఎస్టీ 18 శాతం విధించినప్పటి నుంచి నష్టాలు వస్తున్నాయని అందుకే టెండర్‌లు దాఖలు చేసేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. జీఎస్టీ విధించకంటే ముందు కామారెడ్డి జిల్లాలో తిమ్మారెడ్డి, ఎల్లారెడ్డి యూనిట్‌లో కల్లాలు ఏర్పాటు చేయగా.. సుమారు 5 లక్షలకు పైగా కట్టలు సేకరించినట్టు సమాచారం.

అయితే ఈసారి రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ టెండర్‌లను ఆన్‌లైన్‌లో తీసుకునేందుకు ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ జారీ చేసింది. తొలి విడత టెండర్లను ఫిబ్రవరి 27-28 వెబ్సైట్లో చేయగా 28 సాయంత్రం ఓపెన్ చేశారు. అయితే ఇప్పటి వరకు సైతం కామారెడ్డి జిల్లాలో ఎవరూ ముందుకు రాలేదు. రెండో విడత మూడో విడతలో పిలిచినా స్పందన లేకుండా పోయింది. బీడీ రంగంపై జీఎస్టీ తొలగిస్తేనే ఈ రంగంలో పని చేసే పేదలకు మేలు చేకూరే అవకాశం ఉంది.



కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు

నిఖిత. జిల్లా అటవీ శాఖ అధికారి

జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి ఫిబ్రవరి మాసంలో టెండర్లు పిలిచాము. కానీ ఇప్పటివరకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రాలేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో తునికాకు సేకరణకు కల్లాలు ఏర్పాటు చేయకపోయాం. గ్రామీణ ప్రాంత వాసులు తునికకు సేకరణపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

తునికాకు కల్లాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్ నాయక్



రాష్ట్ర ప్రభుత్వం తునికాకు కల్లాలను ఏర్పాటు చేసి పేదలకు ఉపాధి కల్పించాలి. ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా ఏర్పాటు చేయకపోవడంతో జిల్లాలోని వేలాది పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోయి పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. కేంద్రం జీఎస్టీ విధించడంతోనే తమకు గిట్టుబాటు కావడం లేదని కాంట్రాక్టర్‌లు ముందుకు రావడం లేదు. బీడీ పరిశ్రమలో ఎక్కువ మంది పేదలే పని చేస్తున్నారని, ఈ రంగంపై జీఎస్టీ తొలగించాలి. త్వరలోనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసి ఈ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అన్నదాతకు వర్షం గుబులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

అప్పటికప్పుడే మారుతున్న వాతావరణ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడ వడగళ్ల వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసినదే. మండలంలో వాతావరణంలో మార్పులతో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మబ్బులుగా కనిపించడంతో, ఇంకోవైపు వడగాలులు, వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. వరి పంటను కోత కోయించి బహిరంగ ప్రదేశాలు, కళ్ళల్లో రైతులు అరబోసుకున్నారు. కల్లాలు, బహిరంగ ప్రదేశాలలో ఆరబోసిన ధాన్యాన్ని తడవకుండా మళ్లీ వేరే చోటికి తీసుకెళ్తున్నారు. వర్ష సూచనతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.



ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-బిచ్కుంద

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్‌రావు అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని మిషన్ కల్లాలీ రోడ్ లో గల ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో కలిసిమెలిసి సంతోషకరమైన వాతావరణంలో పండగలు చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసి అభివృద్ధి దిశలో నడుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జునప్పా షెట్కార్, మహ్మద్ గౌస్, విట్టల్ రెడ్డి, ఖలీల్, ధర్పల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

తిరుగుబాటు తత్వాన్ని, లౌకికవాదాన్ని చాటిన వ్యక్తి భగత్ సింగ్

- వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) నివాళి

నవతెలంగాణ-కంఠేశ్వర్

బ్రిటిష్ పాలకుల దురాగతాలను వ్యతిరేకిస్తూ స్వయం పాలన సాధించాలని తిరుగుబాటు జెండాను ఎగరవేసి స్వాతంత్ర పోరాటంలో యువకులను భాగస్వామ్యం చేసిన వ్యక్తి భగత్ సింగ్ అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. లౌకిక వాదాన్ని చాటారని అన్నారు. భగత్ సింగ్ రాజ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. తన 23వ ఏటనే భగత్‌సింగ్‌కు ఉరిశిక్ష వేసినప్పటికీ ఏ మాత్రం వెనకడుగు వేయకుండా సోషలిస్టు వ్యవస్థ ద్వారానే కుల మత వర్గ వ్యవస్థ లేని దోపిడి రహిత సమాజం ఏర్పడుతుందని నినదించిన వ్యక్తి భగత్ సింగ్ అని తెలిపారు. భగత్ సింగ్ ఉరిశిక్షను రద్దు చేయాలని తన తండ్రి క్షమాభిక్ష కోసం అప్పీల్ చేస్తే దాన్ని నివారించి ఈ నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించటానికి ఉరిశిక్ష కైనా సిద్ధమే అని చెప్పినట్టు తెలిపారు. అందువల్లనే ఆయన స్ఫూర్తి నేటికి భారత ప్రజలకు ప్రధా నంగా యువ లోకానికి స్ఫూర్తిదాయకంగా మారిందని ఆయన చిరస్మరణీయంగా మన గలిగారని తెలిపారు.

కానీ నేటి పాలకులు సామ్రాజ్యవాద కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడతా ఉంటే జాతీయ వాదం పేరు తోటి ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతూ అనైక్యతను సృష్టించాలని చూస్తున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ సమైక్యంగా తిరుగుబాటు చేసినప్పుడే ప్రజాస్వామ్యం, లౌకికవాదం పరిరక్షించబడుతుందని అందుకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, సురేష్, విగ్నేష్ నాయకులు దీపిక, ఉద్ధవ్, శ్రీనివాస్, అబ్దుల్, శేఖర్ గౌడ్, ఇమామ్ దినేష్, రాజు,సుచిత్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

రైల్వే స్టేషన్‌కు దారేది..?

- కోతలకు గురైన మట్టి రోడ్డుపై ఇబ్బందికరంగా ప్రయాణం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ (పెర్కిట్) ప్రాంతంలో 9 ఏండ్ల క్రితం రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ రైల్వే స్టేషన్ పట్టణం నుంచి మూడు కిలో మీటర్లు, మామిడిపల్లి జాతీయ రహదారుల నుంచి ఒకటిన్నర కిలోమీటర్లు, పెర్కిట్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఈ స్టేషన్‌కు వెళ్లేందుకు ఒకే ఒక మార్గం ఉంది. ఆ మార్గం సైతం గతేడాది కురిసిన వర్షాల వరదలతో రోడ్డు కొట్టుకు పోయింది. తాత్కాలికంగా రోడ్డు నిర్మాణం చేసిన ప్రస్తుతం ద్విచక్ర వాహనం సైతం వెళ్లాలంటే భయపడాల్సి వస్తుంది. కాగా రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో గుట్టలు, చెరువులు సమీపంలో ఉండడంతో రోడ్డు మార్గం సక్రమంగా లేకుండా పోయింది. రైల్వే స్టేషన్ వరకు మెరుగైన రవాణా సౌకర్యం లేదు. దీంతో స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ రైల్వే స్టేషన్ నుంచి కాచిగూడ నుంచి పెద్దపల్లి, నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు నిత్యం రైళ్లల్లో ప్రయాణికుల రాకపోకలు సాగుతుంటాయి. 2022లో విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు కానీ రోడ్డు పనులు మాత్రం చేయలేకపోతున్నారు. రోడ్డు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు. లేకుంటే తమ ప్రయాణానికి బస్సులే దిక్కు అని వాపోతున్నారు.



కోతకు గురైన మట్టిరోడ్డు



నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు పరిశీలన

నవతెలంగాణ-ధర్పల్లి

అకాలవర్షానికి నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఇది పేదల ప్రభుతం అని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గత రెండు రోజుల క్రితం వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను ఆదివారం పరిశీలించారు. సీతాయిపేట్, ధర్పల్లి, వాడి, హొన్నాజీపేట్ గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో వారంలో కోతకు రానున్న వరి ధాన్యం అకాల వర్షానికి దెబ్బతిన్నదని, తాను అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా వచ్చిన సమాచాన్ని తెలుసుకొని జిల్లా కలెక్టర్ , వ్యవసాయ అధికారులకు వెంటనే పంట నష్ట వివరాలను సేకరించాలని ఆదేశించి నట్టు తెలిపారు. వారు క్షేత్ర స్థాయిలో పర్యటించి సుమారు వెయ్యి ఎకరాల నష్టం వాటిల్లిందని తెలిపినట్టు తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయ మంత్రితో చర్చించానని, త్వరలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చే విషయంలో నిర్ధారణ వస్తుందని తప్పకుండ రైతులకు ఆదుకుంటామని అన్నారు.

సిరికొండ మండలంలోని కొండూరు, చిమన్‌పల్లి, చిన్న వాల్గోట్, గ్రామాల్లో సైతం పంటనష్టం వాటిల్లినట్టు తెలిపారు. గతంలో బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ వస్తే వర్షాలు కురువయని అన్నారని వారు చేసేవి అన్ని అబద్దాలే ఈయేడు వర్షాలు పుష్కలంగా కురిశాయని , పంటలు కూడా అత్యధికంగా పండుతున్నట్టు తెలిపారు. భూగర్భజలాలు ఏండి నీటి కొరత ఏర్పడిందని దానికి ఎవరేమి చేయగలమని అన్నారు. దాన్ని పట్టుకొని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మాటలు నమ్మే పరిస్థితిల్లో రాష్ట్ర ప్రజలు లేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు వచ్చినా ప్రజలకు ఇచ్చిన మాటప్రకారం సంక్షేమ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ పోతామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, సొసైటీ చైర్మన్‌లు చెలిమెల మల్లికార్జున్, జనార్దన్ రెడ్డి, నాయకులు భగవాన్ రెడ్డి , రొండ్ల గంగారెడ్డి , సుభాష్ రెడ్డి , పుప్పాల సుభాష్ , మిట్టపల్లి గంగారెడ్డి , చెలిమెల శ్రీనివాస్, చెలిమెల నర్సయ్య ,కృష్ణ , శ్రీధర్ గౌడ్, సుదర్శన్ గౌడ్, దినకర్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అకాల వర్షాలకు నష్టపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పెండింగ్ వేతనాలకు పోరుబాటు

- రేపు జీపీ కార్మికుల చలో హైదరాబాద్
- పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలి : సీఐటీయూ

నవతెలంగాణ-కామారెడ్డి

జీపీ కార్మికులకు 9 నెలల పెండింగ్ వేతనాల చెల్లింపుల కోసం గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పోరాబాటకు పిలుపునిచ్చింది. ఈ నెల 25న (రేపు) మంగళవారం తలపెట్టిన జీపీ కార్మికుల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ప్రతి జీపీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్, జిల్లా అధ్యక్షులు బాలనర్సు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు ఇస్తామని చెప్పి 15 నెలలు కావస్తున్నా ఈనాటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలి చాలని వేతనంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున కనీస వేతనం 18 వేలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలే శరణ్యమని, కావున జిల్లాలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు ఈ నెల 25న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పెద్దఎత్తున తరలివచ్చిన జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

49 ఏండ్లకు ఆత్మీయ సమేళనం

నవతెలంగాణ-(వేల్పూర్) భీంగల్ రూరల్



వేల్పూర్ మండల కేంద్రంలోని 1976 - 1977 10వ తరగతి పూర్వ విద్యార్థులు 49 సంవత్సరాల తరువాత కలుసుకునీ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరుపుకున్నారు. అనంతరం వారు తమ విద్యార్థి దశలోని జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. పాఠశాలలో జరిగిన విషయాలు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు, తాము చేసిన అల్లరి పనులు, విధించిన పనిష్మెంట్లు, ఆటలు, క్లాసులో జరిగిన విషయాలను గుర్తుచేసుకున్నారు. విద్యనేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ అవకాశం ఉంటే మళ్ళీ ఒకసారి కలుసుకుంటామని సంతోషంలో మునిగితేలారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గన్న వర్షినికి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండల కేంద్రానికి చెందిన గన్న లక్ష్మణ్ కూతురు గన్న వర్షిని భారత జట్టు సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన సందర్భంగా వర్షినికి శాలువతో సన్మానం చేసి రూ.10వేలు ఆర్థిక సహాయం మునిపల్లి మాజీ సర్పంచ్ ముస్కు చిన్న సాయిరెడ్డి అందజేసినట్టు మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 25 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగే ఏషియన్ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొనబోతుందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయికి ఆడమనేది గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆల్ ద బెస్ట్ తెలిపారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో
మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నవతెలంగాణ-కంఠేశ్వర్ /ఆర్మూర్/ మోపాల్/నిజామాబాద్ సిటీ

భగత్ సింగ్ స్ఫూర్తితో మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాందేవ్వాడలోని ఎస్ఎఫ్ఐ ఆఫీసు నుండి అర్సపల్లి భగత్ సింగ్ స్టాచు మీదుగా దేవి రోడ్డు భగత్ సింగ్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ బాబు జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. భగత్ సింగ్ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహానీయుడని కొనియాడారు. తన 23 ఏళ్ల ప్రాయంలో దేశం కోసం ఉరికాంబాన్ని ముద్దాడి బ్రిటీషర్ల నుండి స్వాతంత్రాన్ని అందించిన వీరుని గాథ ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని సూచించారు. భగత్ సింగ్ చరిత్రను పాఠ్యాంశంగా బోధించాలని ఆయన అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ మాట్లాడుతూ భగత్ సింగ్ త్యాగం, సుఖ్‌దేవ్ స్నేహం, రాజ్ గురు ధీరత్వాన్ని పునికి పుచ్చుకొని వారి ఆశయాలను కొనసాగించాలని సూచించారు. భగత్ సింగ్ రవి అస్తమించని సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టి ఈ దేశానికి స్వాతంత్రం అందించాడని ఆయన గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ పేరుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని అన్నారు. భగత్ సింగ్ పేరుతో విశ్వవిద్యాలయలను ఏర్పాటుకు ప్రభుత్వాలను కృషి చేయాలని అన్నారు. భగత్ సింగ్ పోరాట పటిమతో నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నగర కార్యదర్శి చక్రి, జిల్లా నాయకులు రాజు, కిరణ్, వివేక్, సుశాంత్, రాము, రమేష్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : భగత్ సింగ్ ఆశయాలని కొనసాగించాలి తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణ పరిధిలో మామిడిపల్లిలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈసందర్భంగా పల్లపు వెంకటేష్, సిఐటియు మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ ,రాజ్ గురు, సుఖదేవులు బ్రిటిష్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఈ దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని ఉద్యమాన్ని కొనసాగించారన్నారు. పంజాబ్‌ను బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకున్నాక వచ్చిన కరువు కాటకాలు ఆంగ్లేయులు పెంచిన నీటి తీరువా అనేక రెట్లు పెంచి భారాలు మోపినప్పుడు జరిగిన రైతాంగ పోరాటాలకు భగత్ సింగ్ బాబాయి అజిత్ సింగ్ నాయకత్వం వహించారని తెలిపారు. భగత్ సింగ్‌పై బ్రిటిష్ వారు మోపిన దేశద్రోహ కేసులు నేటికీ నచ్చని వాళ్లపై మోపుతూనే ఉన్నారని తెలిపారు. భగత్ సింగ్ స్ఫూర్తితో దేశంలో అధిక ధరలకు నిరసనగా పేద, రైతు, బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.దేశంలో పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు పెద్దపీట వేసి ప్రజలపై భారాల మోపుతున్నారని అన్నారు ఈ విధానాన్ని విడనాడి ప్రజలపై భారాలు వేయకుండా పెట్టుబడి దారులనుండి రావాల్సిన పన్ను బకాయిలను వసూలు చేయాలని, ఇల్లు లేని పేదవారికి ఇల్లు కట్టించే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బుర్ర నాగరాజు, దండుగుల సాయిలు, బాసెట్టి సాయిలు, గంగారం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్: నినాదాలు చేస్తున్న నాయకులు



కంఠేశ్వర్ : నివాళ్లు అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మోపాల్ మండల కేంద్రంలో షాహిద్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవుల 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర నాయకులు బండమీద నరసయ్య మాట్లాడుతూ బ్రిటిష్ వారు దేశం నుండి వెళ్లిపోవాలని ఉద్యమాలు చేసిన భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని అన్నారు. యువత డ్రగ్స్, గంజాయి , మద్యపానానికి గురవుతున్నారని అన్నారు. అఖిల భారత రైతుల సంఘం నాయకులు అగ్గు చిన్నయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అన్నారు. నీళ్ల లేక పంటలు ఎండుతున్నాయని వాటికి నష్టపరిహారం ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముత్యాల పెద్దకాపు రాజారెడ్డి, దండు గంగ మల్లయ్య, గంగాధర్, గంగారం, రజనీకాంత్ ఉపసర్పంచ్ రవి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

యువతరం భగత్ సింగ్ బాటలో నడవాలి

నిజామాబాద్ సిటీ : భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్94వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ సబ్ డివిజన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ లోని మామిడిపల్లిలోగల భగత్ సింగ్ విగ్రహానికి పుల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమనికి మామిడిపల్లి గ్రామ కార్యదర్శి పర్శ సత్యం అధ్యక్షత వహించగా, ముఖ్య వక్తలుగా సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్, కార్మిక సంఘం నాయకులు ఎం,ముత్తేన్న లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ చేస్తున్న మత రాజకీయాలను యువత ప్రశ్నించాలని, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. పిడిఎస్యు రాష్ట్ర నాయకులు అనిల్ కుమార్ మాట్లాడుతూ యువత భగత్ సింగ్ రాజ్గురు సుఖదేవులను ఆదర్శంగా తీసుకొని విద్య కషాయికరణ, నూతన. జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు, కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్, టియుసిఐ నాయకులు అరవింద్, తుర్పటి, నజీర్ శ్రీనివాస్ ,పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు దుర్గ ప్రసాద్, పిడిఎస్యు ఏరియా ఉపాధ్యక్షులు వినోద్, సహాయ కార్యదర్శి సిద్దు, నాయకులు పాల్గొన్నారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చి, జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం అన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా సాయిరెడ్డి పెట్రోల్ బంక్ దగ్గర భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యం కోసం తన స్నేహితులు రాజ్ గురు, సుఖ్ దేవ్‌లతో కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించి ఉరికొయ్యను ముద్దాడిన వీరులని అన్నారు. వారి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్, నాయకులు నవీన్ కృష్ణ, సుభోద్, ప్రదీప్, రమేష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యలో మత జోక్యాన్ని తీసుకువచ్చే నూతన జాతీయ విద్యా విధానం 2020, యుజిసి ముసాయిదా 2025లకు వ్యతిరేకంగాను కామ్రేడ్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థి యువతకు పిలుపునిచ్చారు. కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా నిజామాబాద్ నగరంలో కోటగల్లి, సాయిరెడ్డి పెట్రోల్ బంక్ వద్ద భగత్ సింగ్ విగ్రహాలకు పిడిఎస్‌యూ, పివైఎల్, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సిపిఐ కార్యాలయంలో...

సిపిఐ జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. భగత్ సింగ్ భారత స్వాతంత్ర సమరయోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడని తెలిపారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ విప్లవాత్మక ఉద్యమాలను చేపట్టిన కుటుంబంలో భగత్ సింగ్ జన్మించాడన్నారు. యుక్త వయసులోనే సామ్యవాదమునకు ఆకర్షితుడయ్యాడన్నారు. అలాగే భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ఆశయాలను ఆలోచనలను స్ఫూర్తిగా యువత సిద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, అడ్డికే రాజేశ్వర్, రఘురాం అంజలి రాధా కుమార్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

భారత విప్లవ వేగుచుక్క కామ్రేడ్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పిడిఎస్‌యు, పివైఎల్, పిఓడబ్ల్యు సంఘాల ఆధ్వర్యంలో దేవిరోడ్డు చౌరస్తా, కోటగల్లిలో భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించి నవ్వుతూ ఉరికంబమెక్కిన కామ్రేడ్ భగత్ సింగ్, సుగుదేవ్, రాజ్ గురుల పోరాటస్ఫూర్తి భారత విద్యార్థి, యువతకు సదా ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి, సీఎల్పి జిల్లా నాయకులు భాస్కరస్వామి, టీయుసీఐ జిల్లా నాయకులు లింగం, కిరణ్, విటల్, గంగాధర్, దీపక్, పిడిఎస్‌యు, పీవైఎల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లకు ఘన నివాళి

కంఠేశ్వర్ : భారత ముద్దుబిడ్డ విప్లవ కిశోరాలు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సందర్భంగా భారత ఐక్య విద్యార్థి సమాఖ్య నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని దేవి రోడ్‌లో గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధుల జీవిత పోరాట గాథలను నేటి విద్యార్థులు యువతరంలో విస్తృతంగా అవగాహన స్పృహ కల్పించే కార్యక్రమాలు ప్రభుత్వాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు గణేష్, నగర కమిటీ సభ్యులు వేణుగోపాల్, మహేందర్, మహేష్ రాకేష్, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్‌లో ఉచిత వైద్య శిబిరం

- లైఫ్ ఆస్పత్రి సహకారంతో 210 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం స్థానిక ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆర్మూర్‌కు చెందిన లైఫ్ హాస్పిటల్ ధన్వంతరి విజయ యాత్ర-2 లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ భాను రామగిరి సహకారంతో నిర్వహించారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ భాను రామగిరి (క్రిటికల్ కేర్ అండ్ డయాబెటాలజిస్ట్), డాక్టర్ శ్రీకాంత్ (యండిఎం న్యూరాలజిస్ట్, నరాల వైద్య నిపుణులు) డాక్టర్ స్రవంతి రెడ్డి (స్త్రీల వైద్య నిపుణులు) పాల్గొని వైద్య సేవలు అందించారు. శిబిరంలో మండలం లోని ఉప్లూర్, నాగాపూర్, రాజరాజేశ్వరి నగర్, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామాలకు చెందిన 210 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురు రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన 30 మందిని ఆర్మూర్‌లోని లైఫ్ హాస్పిటల్ కి రెఫర్ చేశారు. అవసరమైన రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులకు, స్థానిక గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు లైఫ్ ఆసుపత్రి వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. శిబిరం నిర్వహించిన లైఫ్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సోమ దశరథ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు బద్దం రమేష్ రెడ్డి, ఎనడ్ల మురళి రెడ్డి, నందగిరి దయానంద్, శ్రీనివాస్ రెడ్డి, బద్దం చిన్నారెడ్డి, రేగుంట దేవేందర్, బోనగిరి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఓం శ్రీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని ఉప్లూర్‌లో ఓం శ్రీ మొదటి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని డ్రా పద్ధతిలో ఎన్నుకున్నారు. ఆదివారం సంఘ భవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రానున్న ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 2025-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా జిందం రమేష్, ఉపాధ్యక్షులుగా ఎనుగందుల శైలేందర్, కార్యదర్శిగా జిందం మల్లేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా యెనుగందుల శశిధర్, ద్యావరశెట్టి హన్మాండ్లు, దైవశెట్టిగా అంగరి రమేష్ లను డ్రా పద్ధతి ద్వారా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు అభినందించారు. 2024-25 సంవత్సరానికి గాను సంఘం జమ, ఖర్చులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పద్మశాలి సంఘం సభ్యులు జిందం శ్రీనివాస్, నాగుల ప్రసాద్, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి

- 24న ఆశావర్కర్ల సమస్యలపై చలో హైదరాబాద్ జయప్రదం చేద్దాం
- సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న నూర్జహాన్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18వేలు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆశా వర్కర్ల ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల సమస్యలపైన మార్చ్ 24న హైదరాబాద్ జయప్రదం చేయాలని, జిల్లావ్యాప్తంగా ఆశ వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, బీఆర్ఎస్ కంటే మా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాని ఆశాల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం, బడ్జెట్ సమావేశాలలో నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుకన్య, రేణుక, స్వప్న, రాధా, శోభ, గంగామణి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ సేవ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని పోతంగల్ కాలన్ గ్రామంలో శ్రీకృష్ణ సేవ యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని ముస్లింలకు శ్రీ కృష్ణ సేవ యూత్ తరపున ఇఫ్తార్ విందును మసీదులో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గాంధారి ఎస్సై ఆంజనేయులు, ముస్లిం నాయకులు జావేద్, శ్రీకృష్ణ సేవ యూత్ సభ్యులు, గ్రామంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని పాతరేద్దాం

నవతెలంగాణ -(సిరికొండ) భీంగల్ రూరల్

విప్లవ వీరకిషోరం కామ్రేడ్ షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తితో కార్పొరేట్ మతోన్మాదాన్ని పాతరేద్దామని సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ పిలుపునిచ్చారు. షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, షుక్ దేవ్ 94వ, వర్ధంతి సందర్భంగా మండలంలోని గడ్కోల్, కొండాపూర్ గ్రామాల్లో సిపిఐ (ఎం.ఎల్) పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి సభను నిర్వహించారు. వారి ఆశయాల సాధించాలంటే ఈ దేశంలో విప్లవం తీసుకురావడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం.ఎల్) ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్. దామోదర్, మండల నాయకులు మల్కి లింబన్న, ఈ రమేష్, ఎస్. కిశోర్, గట్ల కిరణ్, ఎండి.అనిస్, ఎం.ప్రతిప్, మల్కి. హరీష్, బండి అక్షయ్, ఎస్. సంజీవ్, జే. బాల్ రెడ్డి, కట్ట రాములు, జే. ఎర్రన్న, నిమ్మల రాములు, ఎస్. బాలయ్య, ఎస్. గంగామణి, మల్కి.లత, ఏ. సావిత్రి, బండి. విజయ, ఎస్. బాలలక్ష్మి, గ్రామ.సుమలత, ఎస్.రాజేశ్వర్, ఎస్.సాయిలు, పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా కార్యక్రమాలు

- ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



జర్నలిస్టులు మతసామరస్యానికి ప్రతీకగా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ అందాన్ అన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో తాహెర్ బిన్ హందాన్‌తో పాటు మాజీ కార్పొరేటర్ ఖుద్దుస్ సీనియర్ నాయకులు జావీద్ అక్రమ్ బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు మునీర్ రషీద్ జర్నలిస్టులు పాల్గొన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం మైనారిటీల కోసం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం భినందనీయమని తాహెర్ బిన్ హందాన్ కొనియాడారు. హిందూ ముస్లింలు సోదర భావంతో ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, శేఖర్ కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

25న మండల స్థాయి కార్యకర్తల సమావేశం

- మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో ఎంఎం ఫంక్షన్ హాల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఆపార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్ తెలిపారు. భారత రాజ్యాంగ సంరక్షణలో భాగంగా నిర్వహించే జైభీమ్ జై భారత్ సంవిధాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా బీసి సెల్ అధ్యక్షుడు గాజే రాజా నరేందర్‌గౌడ్ పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలోపాల్గొని విజయవంతం చెయ్యాలని కోరారు.

ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత

నవతెలంగాణ-బాల్కొండ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా బాధిత కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం లభించింది. మండల కేంద్రానికి చెందిన ఈరయి మల్లయ్య అనారోగ్యంతో గల్ఫ్ దేశం దుబాయ్‌లో గతసంవత్సరం ఫిబ్రవరి24న మరణించారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన ఎన్ఆర్ఐ పాలసీ పథకంకోసం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌ని బాధితులు అభ్యర్తించగా ఆయన ప్రత్యేక చొరవతో ఎన్ఆర్ఐ పాలసీ ద్వారా రూ.5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మల్లయ్య కుటుంబ సభ్యులు తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కి ధన్యవాదాలు తెలిపారు.

అపూర్వ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ముప్కాల్

ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల 'అపూర్వ కలయిక సమ్మేళనం' ఆదివారం ముప్కాల్ జీఎన్ఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. 41 సంవత్సరాల తర్వాత చిన్ననాటి మిత్రులు కలుసుకున్నారు. ఆనాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. గురువులను సైతం ఘనంగా సన్మానించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

సీసీ రోడ్డు పనులు పరిశీలన



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బంగారుపల్లి గ్రామంలో ఉపాధి హామీలో భాగంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ రాము ఆదివారం గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలలో సిసి రోడ్లతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని, గతంలో వేసిన రోడ్లతో పాటు ఇప్పుడు వేసిన రోడ్లు కలిసి గ్రామమంతా సీసీ రోడ్లతో కలవడంతో అందంగా గ్రామాలు ముస్తాబవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా సిసి రోడ్డు పనులను నాణ్యంగా నిర్మించాలని సంబంధిత గుత్తేదారునికి ఆదేశాలు జారీ చేశామని, లేకుంటే బిల్లులు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. గ్రామ సందర్శనలో ఎంపీడీవో, ఎంపీఓ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించని దుకాణాలు సీజ్

నవతెలంగాణ-బోధన్



బోధన్ పట్టణంలోని పలు ప్రాంతాలలో పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిన పలు దుకాణాలను మున్సిపల్ అధికారులు ఆదివారం సీజ్‌చేశారు. పాత బస్టాండ్ వద్ద గల కేకే సూపర్ మార్కెట్ రూ.3,16,629 పన్ను బకాయిలు ఉండడంతో అధికారులు సీజ్ చేశారు. అలాగే లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో మరో మడిగె పన్ను చెల్లించకుండా బకాయి ఉండడంతో దానిని కూడా సీజ్ చేశారు.

భగత్‌సింగ్ యువతకు ఆదర్శం

- నివాళులర్పించిన పలువురు నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

వర్ని : స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ కారుడు భగత్‌సింగ్ బతికుంటే దేశం మరోలా ఉండేదని, ఆయన జీవితం పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని సీపీఐ(ఎం) నాయకుడు నెల్లూరి లక్ష్మణ్ కొనియాడారు. ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతిని వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమం లో అతి చిన్న వయసులో ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ భారతదేశానికి వేగుచుక్కలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబు, సురేష్, లింగం, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్సి కళాశాల వసతి గృహంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో భగత్ సింగ్ 94వ వర్ధంతిలో భాగంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్ మాట్లాడుతూ.. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ఉరి కొయ్యలను ముద్దాడి భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు ఈ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేశారని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్‌సింగ్ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యారంగ సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రాహుల్, సహాయ కార్యదర్శి నితీన్, నాయకులు శ్రీకాంత్, నవీన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి కార్యక్రమాన్ని మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్, యువ వయసులో భగత్ సింగ్ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆలోచించి పోరాటాలు ఉద్యమాలు చేశారని తెలిపారు.

ఆరేండ్ల వయసులో ఉన్నప్పుడే భారతదేశ ప్రజాస్వామ్యం లేదని, తల్లి తండ్రుల అడుగుజాడల్లో కొనసాగుతూ దేశ ప్రజలందరికీ స్వాతంత్ర్యం అవసరమని భావించి 23 ఏండ్ల సంవత్సరాల వరకు భారతదేశం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేశారని తెలిపారు. ఆ పోరాటంలో బ్రిటీష్ ప్రభుత్వం మహావీరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవుకు ఉరిశిక్ష విధించి పోరా ట యోధులను ఈ లోకంలో లేకుండా చేశారని పేర్కొన్నా రు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు విలాస్, ఉపాధ్యక్షులు షేక్ ఫిర్దోస్, కమిటీ నాయకులు ప్రముఖ విద్యావంతులు రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



వర్ని: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కామారెడ్డిలో...



జుక్కల్‌లో...

ఎమ్మెల్యేను సన్మానించిన దోసుపల్లి గ్రామస్తులు



ఎమ్మెల్యేను సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోసుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సతీష్ పటేల్ జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. దోసుపల్లి గ్రామంలో గ్రామానికి నూతనంగా రెండు వరుసల రోడ్డును ఎమ్మెల్యే కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనులను వేగవంతం చేయాలని, త్వరగా ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని సంబంధిత గుత్తేదారుడికి ఆదేశించారు. రోడ్డు నాణ్యంగా వేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువ నాయకుడు సతీష్ పటేల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావును గ్రామస్తులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్



రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం జన్మదిన వేడుకల్లో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయ కులు పాల్గొన్నారు. జన్మదిన వేడుకలను మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు పత్తి కుమార్ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షులు మద్దెల బాగయ్య జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, తాడ్వాయి కాంగ్రెస్ అధ్యక్షు లు వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు శివాజీ, సదాశి వనగర్ ఎస్సీ విభాగం మండల అధ్యక్షులు కవీన్, తాడ్వాయి ఎస్సి సెల్ అధ్యక్షు లు రాజేందర్, యూత్ మండలాధ్యక్షులు అన్వేష్‌గౌడ్, మైనారిటీ మండలాధ్య క్షులు సాకలి సీనియర్, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరణాంతరం నేత్రదానం

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రానికి చెందిన ఎస్‌దాస్ విశ్రాంత పోలీస్ (ఏఎస్ఐ) ఉద్యోగి నిజామాబాద్ డిచ్‌పల్లి బెటాలియన్‌లో విధులు నిర్వహించిన అనంతరం ఆయన ఉద్యోగ విరమణ చేశారు. తన మరణాంతరం నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఐ హాస్పిటల్‌కు దానం చేస్తానని గతంలో చెప్పినట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఐ హాస్పిటల్, వైద్య సిబ్బంది తెలిపారు. ఆదివారం గ్రామ వాసి దాస్ అంత్యక్రియలను నిర్వహించారు. మరణానంతరం వారి నేత్రాలను లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి, లయన్స్ ఐ హాస్పిటల్ బోధన్ ద్వారా నేత్రాలను సేకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఐ కంటి ఆసుపత్రి బోధన్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ప్రతినిధులు దాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో లయన్ జిఈటి కోఆర్డినేటర్ సూర్యనారాయణ, డిసి మెర్సీ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్‌కుమార్, కార్యదర్శి రాకేష్ వర్మ కోశాధికారి గంగారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులతో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

సదాశివనగర్ గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వడ్ల రాజేందర్, అధ్యక్షులుగా వడ్ల మురళి, ప్రధాన కార్యదర్శిగా వడ్ల లింగం, కోశాధికారిగా వంగాల రవి, ఉపాధ్యక్షులుగా వడ్ల శ్రీనివాస్, వడ్ల మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పాత కార్యవర్గం ఇన్ని రోజులు సేవ చేసినందుకు వారిని సన్మానించారు. అలాగే కొత్త కార్యవర్గాన్ని సైతం సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఉప్పల శ్రీనివాస్, వంగాల గంగాధర్, వడ్ల బాలరాజ్, వంగల గంగాకిషన్, వడ్ల వెంకటేష్, వడ్ల రాజమహేందర్, బాలచంద్రం, వడ్ల నర్సింలు, ఎర్రోజు ఉమాశేఖర్, భాస్కర్, వేణు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షులుగా గైని శివాజీ



నవతెలంగాణ-తాడ్వాయి

ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా గైని శివాజీని నియమించినట్లు జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య తెలిపారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగర్తి ప్రీతం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో నియామకపత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు నాగర్తి ప్రీతం, స్థానిక శాసనసభ్యులు మదన్మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి దళితులకు సాయశక్తులా కృషి చేస్తానని శివాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, సదాశివనగర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కవిన్, తాడ్వాయి ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజేందర్, నగర మైనార్టీ సెల్ సాదక్ అలీ, శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు లింగాగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బంగారుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న నూతన సిసి రోడ్లు, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం, నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలలో ముఖ్యంగా మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కలలను సహకారం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జుక్కల్ మండల కాంగ్రెస్ యువ నాయకుడు లాడేగావ్ సతీష్ పటేల్, గ్రామ నాయకులు, అధికారులు, ఎంపీడీవో, ఎంపీవో, హౌసింగ్ డీఈ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డిని సన్మానించిన నాయకులు



సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

జనగామ గ్రామానికి చెందిన వ్యాపార వేత తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డిని ఆయన నివాసంలో దోమకొండ మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, నాయకులు శాలువాతో ఘనంగా ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిటిఎస్ చౌరస్తా వద్ద లైటు లేక చీకటిగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి తన సొంత డబ్బులతో బీటీఎస్ వద్ద ఐమాక్స్ లైట్ ఏర్పాటు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీతారాం మధు, నాంపల్లి, మాజీ వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- విపిఓల(విఆర్వో) అసోసియేట్ ప్రెసిడెంట్

నవతెలంగాణ-కామారెడ్డి



విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ వ్యవస్థను బిఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులుగా గుర్తిస్తూ ఆ వ్యవస్థను తిరిగి తీసుకువస్తూ జీవో నెంబర్ 41ని విడుదల చేసిన ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి, ఇతర మంత్రులకు వీఆర్వోల రాష్ట్ర సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని (వీఆర్వోల) గ్రామ పరిపాలన అధికారుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మాణిక్యం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలకు జీవో నెంబర్ 41 ద్వారా గ్రామ పరిపాలన అధికారులుగా నియమించిన రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి ముఖ్యమంత్రికి, రెవెన్యూ శాఖ మంత్రికి, ఇతరశాఖల మంత్రులకు, శాసనసభ్యులకు, జేఏసీ నాయకుడు లచ్చి రెడ్డి, గరికె ఉపేందర్‌రావులకు వీఆర్ఓల అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామ న్నారు. గత ప్రభుత్వం తమను దొంగలుగా చిత్రీకరించి చెట్టుకు ఒకరిని, గుట్టకు ఒకరిని చేసి తమ పరువు ప్రతిష్టలు దెబ్బతీసి గ్రామ పరిపాలన కుంటుపడే విధంగా చేసిందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో లేకుండా వీఆర్ఏలను, వీఆర్వోలను వివిధ శాఖలకు కేటాయించి గ్రామ పరిపాలనను చిందరవందర చేసిన గత ప్రభుత్వం తప్పుల్ని గ్రహించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు గ్రామస్థాయిలో మంచి పరిపాలన అందించడానికి, ప్రతి సంక్షేమ పథకాలు అర్హులకు చేరడానికి అర్హులు ఎవరో అనర్హులు ఎవరో లెక్క తేల్చి 62 శాఖలకు సంబంధించిన మంచి సుపరిపాలన అందించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కామారెడ్డి జిల్లా వీఆర్ఏల సంక్షేమ సంఘం తరపున, బాధిత ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

వారు దొంగతనాలు చేసేందుకు.. మమ్మల్ని దొంగలుగా చిత్రీకరించారు..

రెవెన్యూ వ్యవస్థ గ్రామాలలో ఉంటే కొత్తగా అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను దోచుకోవడం సాధ్యం కాదని గ్రహించి, ధరణిని తీసుకువచ్చి అందులో తాము ఎక్కడ అడ్డు పడి నిజాలు ప్రజలకు చెప్తామనే ఉద్దేశంతో తమను దొంగలుగా చిత్రీకరించి తమ వ్యవస్థనే నిర్వీర్యం చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేసి చివరికి మమ్మల్ని చెట్టుకొక్కర్ని, గుట్టకు ఒక్కరిని అన్నట్లుగా బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీఎన్ఎస్ఎఫ్ మోడల్ ఎంసెట్ నీట్ పరీక్ష విజయవంతం

- ప్రతిభా పరీక్షలు విద్యార్థుల భయాన్ని తొలగిస్తాయి
- టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విఆర్కే అకాడమీలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మోడల్ ఎంసెట్ నీట్ పరీక్షను ఆదివారం నిర్వహించినట్టు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షలలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎంసెట్, నీట్ పరీక్షలకు పోటీ తీవ్రంగా పెరిగిపోయిందని, సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తేనే మంచి కళాశాలల్లో సీటు పొందడం జరుగుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ పరీక్ష నిర్వహించడానికి సహకరించిన ఆర్కే విద్యాసంస్థల సీఈవో జైపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రముఖ గణిత శాస్త్ర అధ్యాపకులు జలిగామ శ్రీకాంత్ మాట్లాడుతూ.. చిన్న వయసులోనే లక్షల రూపాయల ప్యాకేజీని ఇంజనీరింగ్ విద్యార్థులు పొందుతున్నారని, దాని కోసం సరైన గైడెన్స్ తీసుకుని విద్యార్థులు జీవితాలను ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దుకోవాలని అన్నారు.

పరీక్ష అంటే భయాన్ని వదిలి అనుకూల వాతావరణం పెంపొందించుకుంటే ఉన్నతస్థాయి ర్యాంకులు సాధించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్కే ప్రిన్సిపాల్ దత్తాద్రి, కోఆర్డినేటర్ నవీన్, టీఎన్ఎస్ఎఫ్ జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ అంజల్‌రెడ్డి, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, గంపప్రసాద్, అధ్యాపకులు గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్, మహేష్, నరేష్, ధర్మపురి, శేఖర్, నవీన్, శ్రీవాణీ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2025-26 సంవత్సరపు ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల ముఖ్య ఎన్నికల అధికారిగా ఎర్రం విగ్నేష్, ఎన్నికల అధికారులుగా జి.మధుసూదన్ గౌడ్, బిట్ల రవిలను నియమిస్తూ నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్‌గౌడ్ బార్ అసోసియేషన్ హాల్లో నియామక పత్రాలు అందజేశారు. ఆదివారం జిల్లా కోర్ట్ ఆవరణంలో గల బార్ అసోసియేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21 శుక్రవారం తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, ఇతర సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌లో అసోసియేషన్ అధ్యక్షుడితో జరిగిన సమావేశంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల అధికారులను నియమించారన్నారు. ఏప్రిల్ 11న ఎన్నికల నిర్వహించాలని ఉత్తరులను జారీ చేసినట్లు పేర్కొన్నారు బార్ కౌన్సిల్‌కు నిజామాబాద్ అసోసియేషన్ మధ్య సమాచార లోపంతో అడ్‌హక్ కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికలు పూర్తిగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాలని ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గం వివరాలను రాష్ట్ర బార్ కౌన్సిల్ సమర్పించాలని బార్ అసోసియేషన్ ను కోరారు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల నియమ నిబంధనకనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలని, జిల్లా కోర్టు ఆవరణంలోని బార్ అసోసియేషన్‌లో నిర్వహించబడతాయని తెలిపారు. సభ్యులందరి సహకారంతో ఎన్నికలు నిర్వహిస్తామని, న్యాయవాదులందరూ ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని జగన్ కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంతరావు ఉపాధ్యక్షులు ఉన్ని పెండెం రాజు కోశాధికారి ఎ.దీపక్, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్ సీనియర్ న్యాయవాదులు పడిగెల వెంకటేశ్వర్ శివాజీ భోస్లె రవి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

నవతెలంగాణ-దోమకొండ



మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై స్రవంతి ఆధ్వర్యంలో బాధితురాలు పద్మ అనే మహిళకు సెల్‌ఫోన్‌ను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై స్రవంతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన, పద్మ అనే మహిళ గత కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోయిందని, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో పోలీసులు సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను అందజేశామని తెలిపారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సిఈఐఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలని, లేదా దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

- తహసీల్దార్ రహీముద్దీన్

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి రెండు గంటల వరకు జరిగే ప్రజావాణిని మండలంలోని గ్రామాల ప్రజలు ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశానికి విద్య, ఆరోగ్య, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీవో, ఐసిడిఎస్, మిషన్ భగీరథ, తదితర అధికారులు హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆహ్లాదకరంగా పల్లెలు



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని మంజీర పరివాహక ప్రాంతంలోని పల్లెలైన హున్స, మంధర్న గ్రామాలు పచ్చని పంట పొలాలతో చూపరులను కనువిందు చేస్తున్నాయి. మంధర్న గ్రామం శివారులో పచ్చని వరి పంటలు, పచ్చని మామిడి తోటలు, అక్కడక్కడ కొబ్బరి చెట్లతో ఆహ్లాదకరంగా కనపడుతుంది.

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఒక్కనెల వేతనం విరాళం

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి తమ వంతు సహాయంగా సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన పురం తిరుపతిరావు-కవిత నర్మాల వాస్తవ్యులు తమ కుమారుడి మొదటి నెల వేతనం రూ.51,016 విరాళంగా ఆలయ కార్యనిర్వహణాధికారికి అందజేశారు. అనంతరం ఆలయ సిబ్బంది దాతలను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్ రావు, ఆలయ అర్చకులు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు డల్లా సురేష్ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు డల్లా సురేష్ మాదిగ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5 నుంచి 14వ తేదీ వరకు మహనీయుల జయంతి ఉత్సవాలున్నందున గ్రామగ్రామాన దళిత సంఘాల నాయకులు, విద్యావంతులు యువకులు ఘనంగా జరుపుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న ఏప్రిల్ మాసంలో దేశ స్వాతంత్రం కోసం, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం భారత రాజ్యాంగాన్ని రచించిన మహనీయుల జయంతి ఉత్సవాలు ఉన్నందున ఘనంగా జరుపుకుందామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు డల్లా సురేష్ మాదిగ అన్నారు. ఏప్రిల్ 5న భారత మాజీ ప్రధాని బాబు జగ్జీవన్‌రావ్ జయంతి, ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతిబాపూలే, 14న భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఉన్నందున మహనీయుల జయంతి ఉత్సవ వేడుకలను దళిత సంఘాల సోదరులు, యువకులు, విద్యావంతులు ముందుకు వచ్చి మహనీయుల వేడుకలను ఘనంగా జరుపుకుందామని తెలిపారు. ఇందుకు అన్నివర్గాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, విద్యావంతులు, గ్రామపెద్దలు, దళిత సంఘాల నాయకులు తమ వంతు సహకారాన్ని అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ఎడపల్లి మండలాధ్యక్షులు మేతరి గంగాధర్, అలికే పోశెట్టి, మొద్దోళ్ల సురేష్, సాయిలు, చిరు, గంగాధర్, డల్ల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బోర్గం (కే)లో కట్టమైసమ్మకు బోనాలు



నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని బోర్గం (కే) గ్రామంలో కట్ట మైసమ్మ బోనాల పండుగను ఆదివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాలను తీశారు. డప్పు వాయిద్యాలతో కట్ట మైసమ్మ వద్దకు వెళ్లి బోనాలు సమర్పించారు. గ్రామంలోని పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు మెడీద గంగాధర్, సభ్యులు రాంపురం గంగాధర్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-భీంగల్ రూరల్

పట్టణంలోని విశ్వబ్రాహ్మణ మను, మయ సంఘ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించే ఎన్నికలలో అధ్యక్షుడిగా రాగి రఘు, క్యాషియర్‌గా దడివి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నిచ్చమొల్ల మనోజ్, పెళ్లి పెద్దలుగా దేవాయి రాజశేఖర్, రాగి రవి, నిచ్చమొల్ల నవీన్, రాగి గంగా నారాయణ, దడివి లింగం (నాగరాజు) లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గం సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఇక్కడ ప్రభుత్వ భూమి లేదట!



అద్దెభవనాల్లో ఉన్న ఎంపీడీవో, గ్రామపంచాయతీ కార్యాలయాలు

- ప్రజా పాలనలో 60 ఎకరాల భూమి సేకరణ
- అదీ పత్రాల్లోనే భూములు
- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- 9 ఏళ్లుగా ఇదే పరిస్థితి

నవతెలంగాణ-ముప్కాల్

పాలన సౌకర్యం కోసం అప్పటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో నూతన జిల్లాలతో పాటు మండలాలను సైతం ఏర్పాటు చేశారు. 2016 అక్టోబర్ 11న నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని స్థానిక బాల్కొండ మండలం నుంచి ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేశారు. ఈ మండలాలు ఏర్పడి దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికి అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు అరకొర సౌకర్యాలతో కొనసాగుతున్నాయి. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు.

స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం పెద్దదిగా ఉండడంతో కార్యాలయం పైన మండల ప్రజాపరిషత్ కార్యాలయం నడుస్తోంది. గ్రామాభివృద్ధి కమిటీ భవనంలో రెవిన్యూ కార్యాలయం, గంగపుత్ర సంఘ భవనంలో పోలీస్ స్టేషన్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం అద్దె భవనంలో, స్థానిక హరిజనవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఒక గదిలో మండల విద్యాధికారి కార్యాలయం ఇలా చెబుతూ పోతుంటే ప్రతి కార్యాలయం ఇప్పటి వరకు అద్దె గదుల్లోనే నడుస్తున్నాయి. కేజీబీవీ పాఠశాల నూతన భవనం నిర్మాణం దశలో ఉంది. మండల కేంద్రానికి చెందిన టి.సాయన్న అనే రైతు తనకున్న 2.15 ఎకరాల స్వంత వ్యవసాయ భూమిని కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణం కోరకు ఇచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా బాల్కొండ ఉమ్మడి మండలంగా ఉన్న నాటి నుంచి ముప్కాల్ పాత జాతీయ రహదారికి అనుకోని పోలీస్ స్టేషన్ సీఐ కార్యాలయం' ఉంది. దాదాపు ఒక ఎకరం వరకు స్థలం ఉంది. అందులో చిన్న భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని ఈ మధ్యకాలంలో తొలగించారు. ఆ స్థలం పోలీస్ స్టేషన్ నిర్మాణంకు సరిపోతే అక్కడే నూతన పోలీస్ స్టేషన్ ను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవనం ఏర్పాటు అయితే అద్దెకు ఇచ్చిన గంగపుత్ర సంఘం సభ్యులు వారి సొంత భవనంలోకి వెళ్లేందుకు ఉత్సహంతో ఉన్నారు. పోలీస్ స్టేషన్ కోసం వారు ఉంటున్న



అద్దెభవనంలోగల రెవెన్యూ కార్యాలయం

భవనం అద్దెకు ఇచ్చి ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నట్లు సంఘ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరోవైపు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతు వేదికలు ఏర్పాటు చేశారు. వాటిలో మండల వ్యవసాయాధికారులు విధులు నిర్వహిస్తున్నారు. తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు నడుస్తుండడంతో ప్రజాపాలన కష్టంగా మారింది. ఈ మధ్యకాలంలో ముప్కాల్ కు నూతనంగా ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైంది. మంజూరైన ఆసుపత్రికి సరైన ప్రభుత్వ భూమి లేకపోవడంతో ప్రస్తుతం అది కాస్త జిల్లా, మండల అధికారుల మధ్య దోబూచులు ఆడుతూ పెండింగులో ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం మొన్న ప్రజాపాలన కార్యక్రమం చేపట్టడం ద్వారా మండల అధికారులు ప్రభుత్వ భూములను గుర్తించి గ్రామస్తులకు వాటి వివరాలను తెలియపరిచారు. మండల కేంద్రంలో దాదాపు అక్కడక్కడా సేకరించగా 60 ఎకరాలు ప్రభుత్వ భూములను గుర్తించారు. గుర్తించిన భూములు కేవలం పత్రాలకే పరిమితంగా ఉన్నాయని భూములను చూపడం లేదని గ్రామస్తులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. దీంతో నూతనంగా ఏర్పడిన ముప్కాల్ మండలం కాస్తా భూ సమస్యలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో గుర్తించిన భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేలా జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ఈ సందర్భంగా కోరుతున్నారు. అందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. జనాల సంఖ్య పెరగడం వల్ల ప్రజాపాలన కష్టంగా మారుతుండడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఉన్నత అధికారులు భూములను గుర్తించి అద్దె భవనాల్లో కొనసాగుతున్న వాటిని తొందరగా నూతన భవనాల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వత భవనాలు నిర్మించండి

కట్ట గోపి, ముప్కాల్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల సౌకర్యం కోసం నూతన జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేసింది. సంవత్సరాలు గడుస్తున్నా నూతనంగా ఏర్పాటైన మండలాల్లో అభివృద్ధి మాత్రం శున్యంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడంతో ఇబ్బందులు పడుతున్నాం. భూములను గుర్తించి శాశ్వత భవనాలను నిర్మించండి.

ప్రభుత్వ భూముల్లో భవనాలు నిర్మించాలి

మాజిత్, గ్రామస్తుడు, ముప్కాల్

ముప్కాల్ గ్రామం మండలంగా మారడంతో మొదటగా సంతోష పడ్డాం. కానీ రోజులు గడుస్తున్నా అద్దె భవనాలలో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతూ, మండల ప్రజలకు ప్రజాపాలన ఇబ్బందిగా మారింది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రభుత్వ భూముల్లో ప్రభుత్వ భవనాలు ఏర్పాట్లు చేసేలా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపాలి.

అత్యుత్తమ సాంకేతికతో వినియోగదారులకు మెరుగైన సేవలు

- నిజామాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినియోగదారునికి అత్యుత్తమ సేవలు అందించడానికి సాంకేతికతతో మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని నిజామాబాద్ సర్కిల్ సూపెరింటెండెంట్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్ తెలిపారు. ప్రతి పనిలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంభిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో మరింత నాణ్యతను మెరుగు పరచడానికి, వినియోగదారుల సంతృప్తిని పెంచడంలో భాగంగా సైది (సిస్టమ్ ఆవరేజ్ ఇంటరప్షన్ డ్యురేషన్ ఇండెక్స్) సైఫీ (సిస్టమ్ ఆవరేజ్ ఇంటరప్షన్ (ఫ్రీక్వెన్సీ ఇండెక్స్) (సైదీ) అనగా సగటు అంతరాయల సంఖ్యని విద్యుత్ అంతరాయాలకు కొలమానంగా తీర్చిదిద్దినట్టు తెలిపారు. అంతరాయం ఎన్నిసార్లు జరిగిన రియల్ టైం డాటాను క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదీకరించి అంతరాయాలు జరగకుండా సత్వర చర్యలు తీసుకొని విద్యుత్ అంతరాయాలు కనిష్ట స్థాయికి తీసుకొచ్చామని తెలిపారు. విద్యుత్ అంతరాయం వచ్చినప్పుడు తక్కువ సమయంలో గుర్తించి త్వరగా మరమ్మతులు చేపట్టడం, ఫాల్ట్ డిటెక్షన్, రియల్-టైమ్ మానిటరింగ్ ఎల్లపుడు చేయడం వల్ల విద్యుత్ అంతరాయాలను వేగంగా గుర్తించి పరిష్కరించడంలో దోహద పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు మరింత సేవలు మెరుగుపరిచే దిశగా ముందుకు వెళ్తున్నామని ఎస్ఈ స్పష్టం చేశారు.

రమణీయం శ్రీవారి కళ్యాణం

- పాల్గొన్న పలువురు సినీ ప్రముఖులు



శ్రీవారి కళ్యాణంలో పాల్గొన్న సినీ ప్రముఖులు

నవతెలంగాణ-మోపాల్

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 4వ రోజు ఆదివారం ఇందూరు తిరుమలలో స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో దర్శకులు వంశీ పైడిపల్లి, సతీష్ వెగ్నేష, జబర్దస్త్ వేణు (బలగం), రచయిత చిన్ని కృష్ణ, నటులు బలగం మైమ్ మధు, సురేందర్ రెడ్డి తదితరులు, స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో దేవనాథ జీయరు స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి, ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, నర్సింహారెడ్డి, విజయసింహ రెడ్డి, ఎంపీటీసీ రాములు, పృథ్వీ, నర్సారెడ్డి, ప్రసాద్, రాజేశ్వర్, రమేష్, భాస్కర్, నరేందర్, మురళి, రాజేశ్వర్, యాజ్ఞాచార్యులు శిఖామణి, సత్యనారాయణ స్వామి శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రెవెన్యూ అధికారి మృతి

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని జర్నలిస్టు కాలనీకి చెందిన పడాల్ విజయ్ కుమార్ (55) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డిఏఓగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి డిఏఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఆయన ఆకస్మిక మరణంతో ఆదివారం పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించగా కామారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు, స్థానిక ఆర్డిఓ రాజా గౌడ్ , బాల్కొండ, ముప్కాల్ రెవెన్యూ అధికారులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షులు కె. బుచ్చన్న తెలిపారు. ఈ సందర్భంగా సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నిక కార్యక్రమంలో అధ్యక్షునిగా నూనె నరేష్, కార్యదర్శిగా మంచిర్యాల సుభాష్, కోశాధికారిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా సతీష్, వేల్పుల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు చక్రధర్ ,కత్రాజీ గంగాధర్, లక్ష్మీనారాయణ, దినేష్ , గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం



మందకృష్ణ చిత్రపటానికిపాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని ఒన్నాజీపేట్ గ్రామంలో ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంఆర్పిఎస్, అనుబంధం సంఘాల నాయకుల సమక్షంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ మండల ఇంచార్జ్ నక్క రాజేందర్ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ పోరులో అలుపెరుగని పోరాటం చేస్తూ ఎన్నో నిర్బంధలను అవమానాలు ఎదుర్కొని నిలబడ్డ ధీరుడు మహాజన నేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అని అన్నారు. ఎంఆర్పిఎస్ పోరాటాల ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఈ వర్గీకరణ మందకృష్ణకు అంకితం అన్నారు. కార్యక్రమంలో చెప్పాల గణేష్ మాదిగ, కొంకా గంగనర్సయ్య మాదిగ, పెద్ది బాలయ్య మాదిగ, మచ్చ రాజన్న మాదిగ,కూతురు నర్సయ్య మాదిగ, అరికెల గంగారాం మాదిగ, లోలం పెద్ద సాయన్న మాదిగ, పెద్ది గంగాధర్ మాదిగ, రుద్రంగి రాజన్న మాదిగ, తదితరులుపాల్గొన్నారు.

గుత్ప గ్రామంలో చావా సినిమా ప్రదర్శన

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలం గుత్ప గ్రామంలోని లక్ష్మీ నరసింహ కళ్యాణ మండపంలో మహావీరుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఛావా చిత్రాన్ని స్క్రీన్‌పై ఆదివారం ప్రదర్శించారు. శంభాజీ మహారాజ్ వీరోచిత గాథను, ధైర్యసాహసాలు, త్యాగం, స్వరాజ్య పరిరక్షణ కోసం చేసిన పోరాటం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇలాంటి చరిత్రపరమైన చిత్రాలను ప్రదర్శించడం ద్వారా యువతలో దేశభక్తిని, ధర్మ పరిరక్షణపై అవగాహనను పెంపొందించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గుత్ప గ్రామ హనుమాన్ స్వాములు, గూండ్లపల్లె యువతకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మొరం, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలో వేర్వేరు చోట్ల ఇసుక, మొరం రెండు ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. మండలంలోని చీక్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మొరం ట్రాక్టర్, బోర్గం గ్రామంలోని పెద్ద వాగులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు 100 నెంబరకు స్థానికులు ఫోన్ చేశారు. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి ఇసుక ట్రాక్టర్ ను తీసుక వచ్చి పోలీసు స్టేషన్‌లో ఉంచారు. వీరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని ఇంఛార్జి ఎస్సై లస్మయ్య తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు పురోగతి సాధించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

నేటి రోజుల్లో మహిళలు అన్ని రంగాలలో పురోగతి సాధించాలని క్షత్రియ సమాజ్ అధ్యక్షులు బచ్చేవాల్ రెడ్డి ప్రకాష్, మాజీ కౌన్సిలర్, న్యాయవాది, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ మహిళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంగీతా ఖాందేష్ అన్నారు. పట్టణంలోని క్షత్రియ కళ్యాణ మండపంలో క్షత్రియ సమాజానికి చెందిన మహిళలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబానికి దిక్సూచి వంటి మగువలు సమాజానికి సైతం బాసటగా ఉండాలన్నారు. మగవారితో సమానంగా మహిళలు చైతన్యవంతులై అన్ని రంగాలలో రాణిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. రాబోయే రోజులలో క్షత్రియ సమాజానికి చెందిన మహిళలు సంఘటితంగా ఉండి పేద ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సాహభరితంగా ఆటపాటలలో పాల్గొన్నారు. గెలుపొందిన జట్లకు బహుమతులను అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులై ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన సంగీతా ఖాందేష్‌కు శాలువా పూల మాలలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్‌కు చెందిన యువజన సమాజ్ అధ్యక్ష కార్యదర్సులు సాత్ పూతే సంతోష్, దుమాని నీరజ్, మహిళా మండలి అధ్యక్షురాలు డీజే సులోచన, ఎమ్ సి మెంబర్స్ గటడి స్వాతి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

పూటకో పార్టీ మారే మీరా.. విమర్శించేది

బీజేపీ నాయకులపై కాంగ్రెస్ ఫైర్

నవతెలంగాణ-ఆర్మూర్

డబ్బులకు అమ్ముడుపోయే వారు.. పూటకో పార్టీ మారే మీరా మా కాంగ్రెస్ నాయకులను విమర్శించేది అని పిసిసి ప్రచార కమిటీ సభ్యులు కోల వెంకటేష్, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ దేగాం ప్రమోద్‌లు అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డబ్బులకు అమ్ముడుపోయే వాళ్ళు, పూటకో పార్టీ మారే వారు కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, ఏబి చిన్నను విమర్శించటం హాస్యాస్పదం అని అన్నారు, రాజకీయాల్లో విమర్శ ప్రతి విమర్శలు కామన్ అని, కాని అరవింద్ ని విమర్శిస్తే ఈ బిజెపి నాయకులు పిచ్చి పట్టిన వారిల మాట్లాడుతున్నారని అన్నారు. 35 ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పీసీసీ అధికార ప్రతినిధిగా ఉన్న ఆయనను ఆర్మూర్‌లో తిరగనివ్వం అనటం వాళ్ళ అజ్ఞానికి నిదర్శనం అని అన్నారు, సుదర్శన్ రెడ్డి చొరవతోనే ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందని స్వయానా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సుదర్శన్ రెడ్డికి పాదభివందనం చేస్తా అన్న మాటలు గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పాడగానే మెదటి క్యాబినెట్ సబ్ కమిటీ నిజం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు ఏర్పాటు చేశారని, 200 కోట్లు బకాయిలు విడుదల చేయించారని, ఈ బడ్జెట్ లో 180 కోట్లు కేటాయించారని తెలిపారు.

అంతే కాని అరవింద్ లాగ కాగితాలు మీద పసుపు బోర్డుల కాదని అన్నారు. నిజంగా అరవింద్ పసుపు బోర్డు తెస్తే నిజామాబాద్ పసుపు రైతులకు ఎందుకు మద్దతు ధర లభించటం లేదని ప్రశ్నించారు. అరవింద్ ఒక టూరిస్ట్ ఎంపీ అని రెండు మూడు నెలలకు ఒకసారి జిల్లాకు వచ్చి ప్రజలు ఆయన గురించి మాట్లాడుకోడానికి ఏదో ఒక కాంట్రావర్శి క్రియేట్ చేసుకుంటాడని అన్నారు. అరవింద్ ఆర్మూర్ నిండి నిజామాబాద్ మధ్య నాలుగు వరుసల రోడ్డు పూర్తి చేయలేదని, లోకమాన్య తిలక్ ట్రెన్ రద్దు అయితే ఇప్పటివరకు దాన్ని పునరుద్ధించలేదని తెలిపారు. ఆర్మూర్ నుండి జగదల్ పూర్ కి జాతీయ రహదారి ఇప్పటివరకు పట్టాలెక్కించని అసమర్ధ ఎంపీ అరవింద్ అని అన్నారు. ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ దేగాం ప్రమోద్ మాట్లాడుతూ.. కంచెట్టి గంగాధర్ మా నాయకుడు చిన్నా అన్న గురించి కాంగ్రెస్ నాయకుల గురించి మాట్లాడుతూన్నారని, కంచెట్టికి మాజీ మున్సిపల్ చైర్మన్ పదవి కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్ష అని అన్నారు. ఇప్పటివరకు నాలుగు పార్టీలు మారిన నువ్వా.. మాట్లాడేది.. రేపు ఏ పార్టీలో ఉంటావో నీకే తెలియదని దుయ్యబట్టారు. 36 వార్డుల్లో ఎక్కడ పోటీ చేసిన ఓడిస్తాం అని ఇదే సవాల్ అని అన్నారు. మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షులు ఎస్.కె బబ్లు మాట్లాడుతూ నర్సింహా రెడ్డి పదేళ్ల కౌన్సిలర్‌గా ఉన్న నిధులు కూడ తేలదని విమర్శించారు. సమావేశంలో నాయకులు కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల కిషన్, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడమిటి ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి షైక్ పాషా, మైనారిటీ సెల్ అధ్యక్షులు హబీబ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సల్మాన్, ప్రధాన కార్యదర్శి రాటం అరుణ్, రాకేష్ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ డిస్ట్రిక్ట్ అమాచూర్ తైక్వాండ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో మాధవ నగర్‌లోని బీఎల్ఎన్ గార్డెన్లో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్ నిర్వహించారు. సుమారు 150 మంది క్రీడాకారులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్టిక్ జడ్జి సునీత కుంచాల, పద్మావతి, తైక్వాండో చైర్మన్ బసవ లక్ష్మీ నరసయ్య వైస్ ప్రెసిడెంట్ నరేంద్ర గుప్తా దీనికి స్పాన్సర్‌గా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాస్, బ్లాక్ బెల్ట్ నేహా గంగాధర్, నాగరాజ్, సిద్ధార్థ, రిత్విక, గోపికృష్ణ క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లోని ప్రతిభ ఈ ప్రదర్శనలో కనబడుతుంది



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ ఈ ప్రదర్శనలో కనబడుతుందని సౌత్ ఎంఈఓ సాయిరెడ్డి అన్నారు. వి ఇగ్నేట్ ఎక్స్పో విజయవంతంగా జరిగిందని విశ్వ వికాస్ పాఠశాల ప్రిన్సిపల్ సుస్మిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిల్యాబ్స్ ఫౌండర్ అమూల నరేష్ వారి టీం సహకారంతో రోబోటిక్, కోడింగ్ సంబంధించిన వి ఇగ్నేట్ ఎక్స్పో విద్యార్థుల ప్రదర్శన నిర్వహించామన్నారు. సహకరించినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతే కాకుండా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను చూసిన తల్లిదండ్రులు ప్రశంసించారు. కార్యక్రమాన్ని విశ్వవికాస్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు విద్యార్థులు, పరిసర ప్రాంతాలు పిల్లలు, ఇతర పాఠశాలల తల్లిదండ్రులు, విద్యార్థులు సందర్శించారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు దాతల చేయూత

- స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేసిన దాతలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద అన్న వితరణ సందర్భంగా వినియోగించే ప్లాస్టిక్ నిర్మూలనకు పలువురు దాతలు చేయూతను అందిస్తున్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం అంజన్న మాల ధారణలో భాగంగా అర్ధ మండల దీక్షలు తీసుకున్న స్వాములు బిక్ష(భోజనం) చేసేందుకు గ్రామానికి చెందిన పలువురు దాతలు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు స్థానిక జంబి హనుమాన్ దేవాలయంలో అంజన్న స్వామి మండల దీక్షలు స్వీకరించారు. ఇటీవల మండల దీక్షలు తీసుకున్న సమయంలో ఆలయం వద్ద మాల ధారణలో ఉన్న స్వాములు బిక్ష కొరకు ప్లాస్టిక్ ప్లేట్లు నిషేధిస్తూ స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు వాడాలని నిర్ణయించారు. స్వాములకు గ్రామానికి చెందిన దాత్రిక రాజు సొంత ఖర్చులతో 80 స్టీల్ ప్లేట్లు, 80స్టీల్ గ్లాసులు కొనుగోలు చేసి అందజేశారు. కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాల్లో అర్ధ మండల దీక్షలు తీసుకున్న స్వాములకు పలువురు దాతలు స్టీల్ ప్లేట్స్, స్టీల్ గ్లాసులను అందజేశారు. మండల కేంద్రానికి వరలక్ష్మి పూజ సామాగ్రి గణేష్ 50 స్టీల్ ప్లేట్లు, 50 గ్లాసులు అందించగా, కీర్తన కిరణం వారు 40 స్టీల్ ప్లేట్లు, 40 గ్లాసులు అందించారు. సుమంగళి డ్రెస్సెస్, ఎస్ జి మార్ట్ ప్రతాప్ 25 స్టీల్ ప్లేట్లు, 25 గ్లాసులు వితరణ చేశారు. వాటిని ఆలయం వద్ద స్వాములకు అందజేశారు. దాతలకు జంబి ఆ హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అంజన్న మాల ధారణ స్వాములు ధన్యవాదాలు తెలిపారు.

యువకులను తప్పుదోవ పట్టిస్తున్నారు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనాడు ఉన్నటువంటి పాలకులు యువకులను తప్పుదోపరుస్తున్నారని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సారా సురేష్ అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద పిడిఎస్‌యు మండల అధ్యక్షులు సిద్దు అధ్యక్షతన కొవ్వొత్తుల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, యువకులు సమ సమాజ మార్పు కోసం భగత్ సింగ్ ఆశయాలను పునికి పుచ్చుకొని తాను చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు జి. కిషన్, వి.సత్యక్క, మండల కార్యదర్శి బి.అశోక్, మండల నాయకులు వి. బాలయ్య ఆనంద్, వి.అశోక్ పాల్గొన్నారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

యూత్ అధ్యక్షులుగా సుమన్‌రెడ్డి



సుమన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ యూత్ అధ్యక్షులుగా సుమన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నారోజును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా జనరల్ సెక్రెటరీ అన్వేష్‌రావు తెలిపారు. ఈ ఎన్నికలు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సర్దార్ నాయక్, యూత్ మండలాధ్యక్షులు అఖిల్ రావు ఆధ్వర్యంలో శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఎన్నిక నిర్వహించినట్లు తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పినందుకు యూత్ సభ్యులకు తన వంతు కృషి చేస్తానని సుమన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు తిరుపతి, ప్రశాంత్‌గౌడ్, తూర్పు రాజులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మానవ హక్కుల సహాయక సంఘం అధ్యక్షుడిగా మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా మానవ హక్కుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షుడిగా మోసర్ల శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్, కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి సలీం ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన మోసర్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ప్రజల హక్కుల కోసం నిరంతరం పాటుపడతానని తెలిపారు.

సామాను ఇవ్వరు.. మరమ్మతు చేయరు..

విద్యుత్ శాఖ అధికారుల తీరు.. రైతుల ఆగ్రహం

నవతెలంగాణ-రామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలం రెడ్డిపేట, మద్దికుంట గ్రామాల రైతుల మర్రి వద్దగల భూముల్లో వరి పంటలు సాగు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు మధ్యలో ఏబీ స్విచ్ ఏర్పాటు చేశారు. గతంలో 2, 3 పర్యాయాలు మరమ్మతులు నిర్వహిస్తే సామాను తామే కొనుగోలు చేశామని, విద్యుత్ సిబ్బంది డబ్బులు తీసుకొని మరమ్మతులు నిర్వహించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏబి స్విచ్ మరమ్మతులో ఉందని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, బోరు బావుల వద్ద మరమ్మతులు వస్తే విద్యుత్ నిలిపివేయడానికి అవకాశం లేకుండా తీగను బంధించారని, చుట్టూ పొదలు అల్లుకోవడంతో ప్రమాదకరంగా మారిందని రైతులు చెబుతున్నారు. మరమ్మతులు నిర్వహించాలని విద్యుత్ అధికారులను కోరగా.. మరమ్మతుకు సంబంధించిన సామాను రైతులు కొనుగోలు చేసి తీసుకురావాలని చెప్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సంబంధిత సామానును మంజూరు చేసి మరమ్మతులు నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

> రైతుల పరిస్థితి ముందు నెయ్యి, వెనుక గొయ్యిగా తయారైంది. ఆరుగాలం కష్టించి.. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని ధాన్యం పండిస్తున్న రైతులకు అడుగడుగునా ఆటంకాలే నెలకొంటున్నాయి. ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను అందిస్తుందన్న పేరు మాత్రమే ఉంది. విద్యుత్ సరఫరాలో మరమ్మతులకు సామాను అందించకపోవడంతో రైతులు తలో రూపాయి వేసి కొనుగోలు చేస్తే, మరమ్మతులు చేయవలసిన విద్యుత్ సిబ్బంది డబ్బు లేనిదే మరమ్మతులు నిర్వహించటం లేదు. దీంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.



ఏబీ స్విచ్ కలిగిన స్థంభమిదే..

ఒక్క రూపాయీ ఇవ్వొద్దు

రైతులు ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదు. పూర్తి మరమ్మతులు విద్యుత్ శాఖ నిర్వహిస్తుంది. ఎవరైనా డబ్బులు అడుగుతే నా దృష్టికి తీసుకురండి. రైతులు డబ్బులు చెల్లిస్తే డబ్బులు తిరిగి ఇప్పిస్తాను. మీ ద్వారా నా దృష్టికి వచ్చింది. పనులు నిర్వహించాలని సిబ్బందికి సూచిస్తాను. **- కళ్యాణ్ చక్రవర్తి, విద్యుత్ డీఈ**

రెండుసార్లు మేమే సామాను కొన్నాం



గతంలో రెండుసార్లు ఏబి స్విచ్ చెడిపోతే మేమే సామాను కొనుక్కొచ్చి ఇచ్చాము. ప్రభుత్వ విద్యుత్ సిబ్బంది వచ్చి డబ్బులు తీసుకొని మరమ్మతు చేశారు. మళ్లీ మరమ్మతుకు వచ్చింది. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉచిత విద్యుత్ ఇస్తున్నామని చెప్పి రైతులను ఇలా వేధించడం సరైనది కాదు. వెంటనే మరమ్మతులు నిర్వహించి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి. **- రైతు దప్పురి స్వామి, రెడ్డిపేట్**

యంత్రాలు పనిచేస్తలే

తహసీల్దార్ కార్యాలయాల్లో పనిచేయని పట్టా పాస్‌బుక్ ప్రింటింగ్ యంత్రాలు

- పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు
- భూములు కొన్నవారికి ఇబ్బందులు



జుక్కల్ మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన లబ్ధిదారులు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో పట్టా పాస్‌బుక్ ప్రింటింగ్ యంత్రం పనిచేయక పోవడంతో భూములు కొన్నవారు, అమ్మినవారు పాస్ బుక్‌లో నమోదు చేసుకునేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. గత కొన్ని నెలలుగా ప్రింటింగ్ యంత్రం పనిచేయడం లేదు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఫీజులు అన్ని చెల్లించుకున్నప్పటికీ పట్టా పాస్‌బుక్‌లో అమ్మిన వారు పొలమున తీసివేయడానికి భూమి కొనుక్కున్న వారి పట్టాపాస్ బుక్‌లో ఎక్కించేందుకు మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రింటింగ్ యంత్రం పనిచేయకపోవడంతో నియోజకవర్గంలోని పిట్లం, డోంగ్లి మండలాల తహసీల్దార్ కార్యాలయాలకు పరుగో పరుగు అంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నదని రిజిస్ట్రేషన్‌కు వచ్చిన బాధితులు వాపోతున్నారు. అసలే అష్టకష్టాలు పడి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వస్తే ఇదేం తలనొప్పి అని బాధితులు తలలు పట్టుకుంటున్నారు.



పనిచేయని ప్రింటింగ్ యంత్రాలు

జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్, నిజాంసాగర్, బిచ్కుంద, మద్నూర్, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని తహసీల్దార్ ఆఫీస్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్న పట్టాపాస్ బుక్కులు ప్రింట్ చేసే యంత్రాలు పనిచేయడం లేదు. రిజిస్ట్రేషన్లు సొంత మండలాల్లో చేయించుకుని అక్కడ ప్రింటింగ్ మెషిన్లు పనిచేస్తున్న మండలాలకు వెళ్తే.. అక్కడ అధికారులు ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేసుకున్నా లబ్ధిదారులకు తాము సేవలు చేయాలా ? లేక వద్దా ? బయట నుంచి వచ్చిన మీకు పనులు చేయాలా? అని పోయిన వారిని ప్రశ్నిస్తున్నారు. ఎక్కడ అమ్మారో, కొన్నారో అక్కడే మీ పాస్ పుస్తకంలో ఎంట్రీలు, రిమూవల్ చేసుకోవాలని లేకుంటే ఇక్కడ ఎంట్రీ చేయబడదని అక్కడి అధికారులు చెబుతున్నారు. ఈ విషయమై జుక్కల్ తహసీల్దార్ హిమబిందును వివరణ కోరగా.. పాస్ బుక్కు ప్రింట్ చేసే యంత్రాలు పనిచేయడం లేదనే మాట వాస్తవం. అయినప్పటికీ ఇప్పటికే పలుమార్లు జిల్లా కేంద్రానికి సమాచారం అందించాం. వాటి బాగోగులు చేయడానికి నిధులు లేవు. నిధులు వచ్చినప్పుడు వాటిని బాగు చేసి మళ్లీ పనిలో పెడతాం.' అని సమాధానమిచ్చారు.

ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాలలో పాస్ బుక్కు ప్రింటింగ్ యంత్రాలు పనిచేసేందుకు నిధులు కేటాయించి వెంటనే వాటికి మరమ్మతులు చేయించి భూములు అమ్మిన వారి, కొన్నవారి సమస్యలను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను ఆదివారం గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్ రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేపట్టడానికి ఇప్పటికే గ్రామాల వారీగా ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. మండలంలోని ఒక గ్రామం ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని వివరించారు. ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో లింగంపేట్ మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో ఇందిరమ్మ మోడల్ నిర్మాణ పనులు చేపడుతుండగా.. పనులను ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్ రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో డిఈ సుభాష్, ఎంపీడీవో నరేష్, ఏఈ అశోక్ సిబ్బంది ఉన్నారు.

పోతాయపల్లిలో పెద్దమ్మ ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో పెద్దమ్మతల్లి పెద్దరాజుల ప్రథమ వార్షిక కళ్యాణ మహోత్సవం శుక్రవారం ప్రారంభమైనట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

నీలా శివారుకు అలీసాగర్ ఎత్తిపోతల పథకం సాగునీరు



కాలువ ద్వారా సాగునీరు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీలా శివారులో చేతికి వచ్చిన పంటలు ఎండుముఖం పట్టడంతో రైతుల అభ్యర్థన మేరకు మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు నీటిపారుదల శాఖ అధికారులు నీలా శివారు వరకు అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా అందించడానికి సత్వర చర్యలు చేపట్టారు. కందకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని అందించాల్సి ఉండగా కందకుర్తి ఎత్తిపోతల పథకం మోటర్లు చెడిపోవడంతో అలీసాగర్ నీటిని మళ్లించారు. సుమారు 200 ఎకరాలకు చివరి తడికోసం నీటిని వదలగా రైతులు తమ పంట పొలాల్లో సాగునీటిని అందిస్తున్నారు. ఇటీవల కాలువ మరమ్మతుల కోసం రైతులు, నీటిపారుదల శాఖ అధికారుల సహకారంతో ప్రొక్లెయిన్‌తో ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవడంతో రైతుల్లో ఆనందం నెలకొంది.

బంజారాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

నవతెలంగాణ-పిట్లం

బంజారాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. మండల కేంద్రంలోని సాయి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ప్రభుత్వ అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న మాలిన్యాన్ని తొలగించాలని సదుద్దేశముతో తన జీవితాన్ని త్యాగం చేసిన మహా పురుషుడు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. అభివృద్ధికి దూరంగా ఎక్కడో మూఢనమ్మకాలతో జీవనం సాగించే బంజారాలకు దిశానిర్దేశం చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రతి తండాలకు 10, 15 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించినట్టు తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రతి తండాలో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టినట్టు వివరించారు. ముందుగా బంజారాలు సాంప్రదాయంగా కొలిచే దైవం బోగ్ బండార్ పూజలను బంజారాలతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ నియోజకవర్గస్థాయి ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, బంజారాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమించాలి

నవతెలంగాణ-కామారెడ్డి/బోధన్

భారత ఉపఖండాన్ని ప్రభావితం చేస్తూ ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల స్ఫూర్తితో ఉద్యమించాలని పిడిఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి జి.సురేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో గల భగత్‌సింగ్ విగ్రహానికి శనివారం 94వ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ.. భారత స్వతంత్ర సంగ్రామంలో వందలాదిగా ఉద్భవించిన సాయుధ విప్లవ వీరులలో భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు ప్రత్యేకతను సొంతం చేసుకున్నారని, భారతదేశం ఎదుర్కొంటున్న సమస్యలను మార్క్సిజాన్ని జోడించి విశ్లేషించిన మహా మేధావులను దేశం కోల్పోయిందని అన్నారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ విధానానికి, కులతత్వానికి, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడే భారత ప్రజలకు భగత్‌సింగ్ నిరంతరం పోరాట స్ఫూర్తిదాయకమని అన్నారు. నేడు భారతదేశం హిందుత్వ ఫాసిజంతో ప్రత్యేకమైన పరిస్థితిని ఎదుర్కొంటుందని భగత్ సింగ్ అతని సహచరులు రాజగురు, సుఖదేవ్‌లు ఏ విధంగా అయితే మతాన్ని పూర్తిగా వ్యక్తిగతమని ప్రకటించి మతాన్ని అన్ని స్థాయిల్లో తీవ్రంగా వ్యతిరేకించి మతం విషయంలో రాజీపడని శత్రువుల్లా వ్యవహరించారో నేడు భారత విద్యార్థి, యువకులు వారి స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు దేశంలో ఒకే జాతి ఒకే మతం ఒకే భాష అంటూ ఫెడరల్ సూత్రాలకు వ్యతిరేకంగా బిజెపి పాలన కొనసాగిస్తుందని అందులో భాగంగానే పార్లమెంట్ అభిప్రాయాలను సైతం లెక్కచేయకుండా నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయడం కోసం స్కిల్ ఇండియా పేరుతో బలవంతంగా ఆమోదించుకొని ప్రభుత్వ విద్యను బలిపీఠంపై ఎక్కిస్తుందన్నారు. యూనివర్సిటీల నూతన ముసాయిదాను తీసుకొచ్చి విశ్వవిద్యాలయాలలో పరిశోధక విద్యార్థులపై, ప్రజాస్వామ్య విలువలపై దాడి చేస్తుందని తెలిపారు. దేశంలో కోట్లాదిమంది విద్యార్థి యువకులను కంపెనీ యాజమాన్యాలకు బానిసలను అందించే విధంగా విద్యా వ్యవస్థ మార్చబోతుందన్నారు. బిజెపి అనుసరించే విధానాలపై నేటి విద్యార్థి యువకులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవుల స్ఫూర్తితో ప్రశ్నించి వ్యవస్థ మార్పు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి ఎ.ప్రకాష్, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు దేవిసింగ్, పిడిఎస్‌యు జిల్లా నాయకులు రాకేష్, శేఖర్, శ్రీకాంత్, శివాజీ, అరవింద్, పార్టీ మండల నాయకులు పోశాద్రి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి : పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) కామారెడ్డి జిల్లా కార్యాలయంలో భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎల్.దశరథ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.శివప్రసాద్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను కొనసాగిస్తామని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ అమలు చేయాలని, భగత్‌సింగ్ వర్ధంతిని, జయంతిలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారకంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. దేశ స్వాతంత్రం కోసం ఇంగ్లీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన వీరులన్నారు. ఒక మనిషిని మరో మనిషి దోపిడీ చేయలేని సమాజం కావాలని, అందరూ సమానత్వంగా బతకాలని బానిసత్వాన్ని కొనసాగించవద్దని దేశ సంపదను కొల్లగొట్టవద్దని ప్రతి పౌరునికి దేశంలో స్వతంత్రంగా బతికే హక్కు ఉండాలని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు ఎల్.సంపత్, జస్వంత్, రాజు, సాయి, సనత్, నిరంజన్, గణేష్, రాజకుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి బాలరాజు, దేవయ్య పాల్గొన్నారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి..

బోధన్ : బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కామ్రేడ్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారి పోరాట స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.మౌనిక, పివైఎల్ బోధన్ పట్టణ నాయకులు నాగేశ్వర్, ఎం.నవీన్, హెచ్.స్వామి, జి.రవి, ఎం.సాయినాథ్, కె.నిఖిల్, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి యువకుడి మృతి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం జాడీజమాల్‌పూర్ గ్రామానికి చెందిన మోతేవార్ రమేష్(26) ఆదివారం పొలానికి వెళ్లి ఇంటికి తిరిగివస్తున్న క్రమంలో మధ్యలో కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేయడానికి చెరువు మెట్లపై కూర్చోగా ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో మునిగి చనిపోయినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుని తండ్రి నాగనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం హున్సా, మంధర్న సమీపంలోని మంజీర నదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన ఇసుక తరలిస్తే వాహనాలు పట్టుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

స్వస్థలం బోధన్‌కు వచ్చిన వైస్ ఛాన్సలర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన వై.ఎల్.శ్రీనివాస్ గత కొన్ని రోజుల క్రితం ములుగు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. దాంతో బోధన్ పట్టణ వాసులు ఆయన నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం తన స్వస్థలం బోధన్‌కు వచ్చారు. సమాచారం తెలుసుకున్న ఆయన స్నేహితులు అడ్లూరి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మెన్ గౌసోద్దీన్ తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకుని సన్మానించారు.

సిలిండర్ పేలి వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-రెంజల్

సిలిండర్ పేలి వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మోతీలాల్ అనే వ్యక్తి ఇంట్లో సిలిండర్ పేలడంతో గాయాలు కాగా.. అయనను 108లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్యాస్ పైప్ లీకేజీతో ఘటన చోటుచేసుకుంటున్నట్టు స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం మోతిలాల్ ఆసుపత్రిలో కోరుకుంటున్నాడని కుటుంబీకులు తెలిపారు.

విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న డీసీఎం

- డ్రైవర్‌కు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు



విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్న డీసీఎం

నవతెలంగాణ-బోధన్

బోధన్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న డీసీఎం వ్యాన్ అదుపుతప్పి ఆదివారం సాలూర సమీపం వద్ద బైపాస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హైలెవల్ విద్యుత్ స్థంభానికి బలంగా ఢీకొట్టింది. అందులోని డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాన్స్‌కో ఏఈ కళ్యాణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.